క్లుప్తంగా

వేతన బకాయిలు చెల్లించాలి



వినతిపత్రం అందిస్తున్న వీవోఏల సంఘం నాయకులు

ఎచ్చెర్ల: ఏపీ వెలుగు సంస్థలో పనిచేస్తున్న వీవోఏలకు మూడు సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ వీవోఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు ఎ.మహాలక్ష్మి కోరారు. ఈ మేరకు ఎచ్చెర్ల వెలుగు కార్యాలయ సిబ్బందికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ వెలుగు ఉద్యోగుల సంఘం రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు వీవోఏల డిమాండ్లు తెలియజేస్తూ వినతిపత్రాలను అందించడం జరిగిందన్నారు. వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. మహిళా మార్టుల్లో బలవంతపు సరుకుల కొనుగోళ్లను ఆపాలన్నారు. నిబంధనలకు విరుద్ధగా వీవోఏలను తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవోఏలు అన్నపూర్ణ, రాజేశ్వరీ, ఉత్తర, కృష్ణవేణి పాల్గొన్నారు.

మాటిచ్చి మొండిచెయ్యి చూపారు



మాట్లాడుతున్న తవిటినాయుడు తదితరులు

ఎచ్చెర్ల: లావేరు మండలంలో రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా నిధులు మంజూరు చేస్తే వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లకు 40 శాతం పనులు కేటాయిస్తామని చెప్పి, ఎంపీపీ వద్ద తీర్మానాలు తీసుకుని, ఇప్పుడు కూటమి నాయకులకు మాత్రమే పనులను కేటాయించి మొండిచేయి చూపించారని మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు జగ్గురోతు తవిటినాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి మీసాల శ్రీనివాసరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఇనుపకుర్తి సతీష్, డి.శివ, శాంతాటి భాస్కరరావులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో వీరు మాట్లాడుతూ.. 321 పనుల్లో 40 శాతం పనులను వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులకు ఇస్తామని చెప్పారని, ఇప్పుడు మోసం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

కారు దగ్ధం



దగ్ధమైన కారు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం పరిధిలోని విశాఖ-బీ కాలనీలో మంగళవారం రాత్రి 11 గంటల తర్వాత ఒక కారు దగ్ధమయ్యింది. మున్సిపాలిటీ చెత్త పోగులు నిమిత్తం అదేరోజు ఉదయం మంటలు పెట్టి వదిలేశారు. కారును ఆ పక్కనే రాత్రి పార్కింగ్ చేశారు. దీంతో మంటలు చెలరేగి ఒక్కసారిగా కారు మొత్తం తగలబడింది. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అర్ధరాత్రి 12 గంటలు తర్వాత అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. దీనిపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ తెలిపారు.

అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న రంగారావు

శ్రీకాకుళం అర్బన్: సుకన్య సమృద్ధి యోజన పథకంపై బాలికల తల్లిదండ్రులకు అంగన్‌వాడీ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీకాకుళం తపాలాశాఖ ప్రధాన కార్యాలయ అధికారి పడాల రంగారావు అన్నారు. నగరంలోని 80 అడుగుల రోడ్డులో ఐసీడీఎస్ కార్యాలయంలో తపాలాశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సీడీపీవోలకు, సూపర్‌వైజర్లు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని బాలికలను సుకన్య సమృద్ధి యోజన పథకంలో చేర్పించాలన్నారు. పథకంలో కనిష్టంగా రూ.150 నుంచి గరిష్టంగా ఏడాదికి రూ.1.50 లక్షల వరకూ కట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, తపాలాశాఖ ఏఎస్‌పీ బి.విశ్వేశ్వరరావు, ఐసీపీఎస్ అధికారి కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సుమబిందు

జి.సిగడాం: గ్రామాల్లో అంటురోగాలు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పేకల సుమబిందు అన్నారు. మండలంలోని పెంట గ్రామంలో రోగులకు వైద్య పరీక్షలు బుధవారం నిర్వహించారు. గ్రామాల్లో చిన్న, చిన్న కాలువల్లో నీరు ఉంటే దోమలు వ్యాపించే అవకాశం ఉందన్నారు. మురికి నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం జి.భవానీ, ఎంఎల్‌హెచ్‌పీ ఆశపు సుభాషిణి పాల్గొన్నారు.

వేదన..!

- రౌతుపేట ప్రజలకు వంతెన కష్టాలు
- నిత్యావసరాలకు సైతం చెరువు దాటాల్సిందే
- ప్రాణాలకు తెగించి ప్రయాణాలు



వంతెన నిర్మించాల్సిన రామసాగర్ చెరువు

జి.సిగడాం: మండలంలోని ముషినివలస పంచాయతీ రౌతుపేట గ్రామంలో సుమారుగా 2 వందల గృహాలు, 600 మంది జనాభా ఉన్నారు. అయితే పంచాయతీలోని ముషినివలస - రౌతుపేట గ్రామాల మధ్య రాకపోకలకు రహదారి సౌకర్యం లేదు. ఈ రెండు గ్రామాల మధ్య రాకపోకలు కొనసాగించాలంటే రామసాగర్ చెరువును దాటుకుంటూ వెళ్లాల్సిందే. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

2 కి.మీ నరకయాతన

ఈ రెండు గ్రామాల మధ్య ప్రయాణాలు చేయాలంటే మధ్యలో చెరువు ఉంది. దీంతో పసిపిల్లల నుంచి పండు ముసలి వరకు చెరువులో దిగి సుమారుగా 2 కిలోమీటర్ల దూరంలో కాలినడకతో వెళ్తున్నారు. నిత్యావసర సరుకులకు సైతం నిత్యం చెరువులో దిగి వెళ్లాల్సిందే. అయితే వర్షాకాలం అయితే చెరువు దాటి వెళ్లాలంటే ప్రాణాలకు తెగించాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలు పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు. గతంలో వంతెన నిర్మాణం కోసం సర్వే కూడా చేపట్టారని గుర్తు చేసుకుంటున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మా గ్రామం నుంచి ముషినివలస పంచాయతీకి వెళ్లాలంటే నానా ఇబ్బందులు పడుతున్నాం. జిల్లా స్థాయి అధికారులు వచ్చి సర్వేలు చేశారు తప్ప పనులు చేయలేదు. మా గ్రామం నుంచి ముషినివలస, సర్వేశ్వరపురం వెళ్తున్న సమయంలో మార్గమధ్యలో ఎంతోమంది చెరువులో పడి అస్వస్థతకు గురయ్యారు. కానీ ఇంతవరకు ఎవరూ పట్టించుకోలేదు. తక్షణమే చర్యలు చేపట్టాలి.

– చందక సతీష్, రౌతుపేట గ్రామం

వినతులు అందించాం



మా గ్రామం నుంచి ముషినివలస పంచాయతీకి వెళ్లాలంటే చెరువులో దిగి వెళ్తున్నాం. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం కోసం అధికారులకు, నాయకులకు ఎన్నో వినతులు అందించాము. కానీ ఎవరూ పట్టించుకోలేదు.

– ఎస్.శారద, సర్పంచ్, ముషినివలస పంచాయతీ

పనిచేయని సర్వర్



తపాలాశాఖలో సర్వర్ డౌన్ కావడం వలన పలు సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. గత 5 రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో వినియోగదారులు, ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీకాకుళంలో ఉన్న ఒక్క ప్రధాన తపాలాశాఖలో మాత్రమే సర్వర్ పనిచేయడంతో నగరంలోని పలు తపాలాశాఖలకు చెందిన ఖాతాదారులు వారి పనుల నిమిత్తం ప్రధాన తపాలాశాఖకు చేరుకోవడంతో ఖాతాదారులతో కిటకిటలాడుతోంది.

– శ్రీకాకుళం అర్బన్

రోడ్డుపైనే చెత్త



చిలకపాలేం సమీపంలోని సర్వీస్ రోడ్డులో పలు దుకాణాలు నిర్వహిస్తున్నారు. అయితే వారంతా దుకాణాల వ్యర్థాలను రోడ్డుపై పడేస్తుండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. జాతీయ రహదారుల సంస్థ నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించదు. మరోపక్క పంచాయతీ సైతం నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమం జాతీయ రహదారిపై నిర్వహించడం లేదు. దీంతో రోడ్డుపక్కల చెత్త పేరుకొని అపారిశుద్ధ్యంగా మారుతోంది.

– ఎచ్చెర్ల క్యాంపస్

ఉపాధి వారధి



శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిల కింద జోరుగా వ్యాపారాలు సాగుతున్నాయి. చుట్టుపక్కల ఉన్నవారంతా చిన్నపాటి దుకాణాలు పెట్టుకొని జీవనాధారం పొందుతున్నారు. ప్రధానంగా బైరి, కొత్త రోడ్ జంక్షన్ల వద్దనున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జిలన్నీ వ్యాపార కేంద్రాలుగా మారాయి.

– శ్రీకాకుళం రూరల్

పరామర్శ



ఎచ్చెర్ల: కోటీశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల: రణస్థలం మండలంలోని ఎర్రవరం సచివాలయంలో వెటర్నరీ ఉద్యోగిగా విధులు నిర్వహించిన లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన గొర్లె కోటీశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ కేజీహెచ్‌లో సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉద్యోగి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తరుపున ఉద్యోగి కుటుంబానికి తగిన సాయం అందించాలని కోరారు. కారుణ్య నియామకంలో అతని భార్యకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అలాగే లావేరు మండలంలోని మురపాక గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మలిపెద్ది ఆనందరావు మాతృమూర్తి మలిపెద్ది వసుంధర ఇటీవల కనుమూశారు. దీంతో వారి కుటుంబ సభ్యులను సైతం పరామర్శించారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ మీసాల సీతంనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెయ్యిల లక్ష్మణరావు, బాలి శ్రీనివాసనాయుడు, మజ్జి శ్రీను, మలిపెద్ది నారాయణమూర్తి, రెడ్డి గోపాల్, తేనెల చిన్నారావు తదితరులు ఉన్నారు.

రణస్థలం: మండలంలోని చిల్లపేట రాజాం గ్రామానికి చెందిన విద్యార్థి కె.శ్యామలరావు బీసీ వసతి గృహంలో అస్వస్థతకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో ఆ కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పరామర్శించారు. విద్యార్థి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అలాగే మరువాడ సర్పంచ్ జక్కంపూడి అచ్చిబాబు ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలిసి అతన్ని పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పాతర్లపల్లి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొర్లె అన్నంనాయుడు కుమారుడు ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మహంతి వెంకటప్పలనాయుడు, బెల్లం అప్పలనాయుడు, కంబవు నరసింహులు రెడ్డి, కొంఐతాల లక్ష్మణరెడ్డి, పాలం రామకృష్ణ, జక్కంపూడి కోటి, జక్కంపూడి గురువులు తదితరులు పాల్గొన్నారు.

10న సర్వసభ్య సమావేశం

శ్రీకాకుళం రూరల్: ఈనెల 10న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు శ్రీకాకుళం ఎంపీడీవో బొడ్డేపల్లి శైలజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ సెక్రటరీలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న యువత

శ్రీకాకుళం కల్చరల్: బొందిలీపురంలోని ఖ్యాతి వృద్ధాశ్రమంలో తన జన్మదినం సందర్భంగా కోరాడ దుర్గాప్రసాద్ అన్నదాన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. నగరంలో ప్రతినిత్యం ఏదో ఒక సేవలో ఉంటున్న ఉర్లాం శివతేజ, జిల్ ఫౌండేషన్ జాడ సాయి, మదర్స్ లవ్ ఫౌండేషన్ సుప్రజ రౌత్, ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ ప్రతినిధి నంది ఉమాశంకర్ చేస్తున్న సేవలు స్ఫూర్తిగా తీసుకొని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వి.విజయ్, బొట్టా శంకర్, కలగ రాజు, కోరాడ గౌతమ్, నవీన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ

శ్రీకాకుళం అర్బన్: ఎల్ఐసీలో ఉద్యోగావకాశాలపై మహిళలకు అవగాహన కల్పించేలా అంగన్‌వాడీ సీడీపీవోలు, సూపర్‌వైజర్లు కృషి చేయాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధికారి బగాది శాంతిశ్రీ అన్నారు. బుధవారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయంలో ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఆఫ్ టు ఉమెన్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సీడీపీవోలు, సూపర్‌వైజర్లకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ పాసైన నిరుద్యోగ మహిళా అభ్యర్థులు ఉంటే, వారు ఎల్ఐసీ ఏజెంట్లుగా పనిచేసేటట్లు చూడాలన్నారు. ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో ఒక అభ్యర్థి ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేసేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఐసీ చీఫ్ మేనేజర్ సుబ్బారావు ఏఏ పథకాలు ఉన్నాయో వివరించి, వాటి వలన చేకూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ డవలప్‌మెంట్ అధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దాడ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఎచ్చెర్ల:

మండలంలోని ముద్దాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు చిత్రలేఖనంలో అంతర్జాతీయ అవార్డులు వరించాయి. హైదరాబాద్‌కు చెందిన కాసుల చిత్రకళ అకాడమీ అధినేత్రి కాసుల పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్చువల్ చిత్రకళా పోటీల్లో బలగ సిద్ధూ, నూలు చైతన్య, వెలినాటి ధరణి, లిపి శ్రీవల్లిలకు కాంస్య బహుమతులు లభించాయి. విద్యార్థులను పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ కర్రి నీలవేణి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

సివిల్ సర్వీసెస్ క్రీడా పోటీల్లో రాణింపు



డి.యశోద



ఎం.భాగ్యలక్ష్మి



జె.రవి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి సివిల్ సర్వీసెస్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు హవా కనబరుస్తున్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వేదికగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ పోటీలు బుధవారం మొదలయ్యాయి. ఇప్పటికే పలు క్రీడాంశాల్లో లీగ్ దశ దాటి క్వార్టర్స్‌లో అడుగుపెట్టగా, తాజాగా అథ్లెటిక్స్ ఈవెంట్స్‌లో సత్తాచాటుతున్నారు. తొలిరోజు అథ్లెటిక్స్‌లో డి.యశోద 100, 200 మీటర్ల పరుగు పందాల్లో బంగారు పతకాలు సాధించగా, జె.రవి జావెలిన్ త్రో, డిస్కస్ త్రోలో కాంస్య పతకాలు సాధించారు. అలాగే ఎం.భాగ్యలక్ష్మి షాట్‌పుట్, లాంగ్‌జంప్‌లో ప్రతిభ కనబర్చి 5వ స్థానంలో నిలిచింది. వీరి రాణింపుపై మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డేపల్లి నారాయణరావు, పాలకొండ అప్పారావు, చల్లా జగదీష్, డీఎస్‌డీవో డాక్టర్ శ్రీధర్‌రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు బాసటగా...



పరీక్ష ఫీజుల మొత్తాన్ని అందజేస్తున్న విశ్రాంత ప్రొఫెసర్ నూకరాజు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం హయాతీనగరంలోని ఉన్న మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ బాలికల గురుకుల ఉన్నత పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు వ్యవసాయ కళాశాల విశ్రాంత ప్రొఫెసర్ ఎ.నూకరాజు బాసటగా నిలిచారు. పాఠశాలకు చెందిన విద్యార్థులకు మార్చి-25లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజులకు అవసరమయ్యే రూ.6,500లను నూకరాజు బుధవారం విరాళంగా అందజేసి, పేద పిల్లలకు ఆపన్న హస్తాన్ని అందించారు. ఈ మొత్తాన్ని ప్రిన్సిపాల్ గొలివి స్వరాజ్యలక్ష్మి చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. నూకరాజు దాతృత్వాన్ని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కొనియాడారు.

నిరాశ్రయులను ఆదుకుందాం



నిరాశ్రయులకు ఆహారం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: నిరాశ్రయులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వాకర్స్ ఇంటర్నేషనల్ 102 ఎలక్ట్ గవర్నర్ కొంక్యాన మురళీధర్ అన్నారు. కొంక్యాన శాంతమ్మ 20వ వర్ధంతి సందర్భంగా నగరంలోని గొంటివీధి ప్రకాష్‌నగర్ కాలనీలో ఉన్న నైట్ షెల్టర్లలో నిరాశ్రయులు, నిరుపేదలకు మంగళవారం రాత్రి ఆహార పదార్థాలు, పండ్లు పంపిణీ చేశారు. తన తండ్రి కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు తరపున పలుమార్లు భోజన వితరణ చేశామని తెలిపారు. కార్యక్రమంలో కొంక్యాన చారిటబుల్ ట్రస్టు సభ్యులు వేణుగోపాల్, మంగమ్మ, సరోజ, శివశంకర్, డాక్టర్ వినీల, తేజస్వినీ, గౌతమ్ స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఉర్లాం శివతేజ, నంది ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలు వినియోగించుకోవాలి



వెంకయ్యపేటలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

జి.సిగడాం: భూ రీసర్వే పూర్తైన గ్రామాల్లో ఎక్కడైనా తప్పులుంటే వాటిని సర్దుబాటు చేసుకునేందుకు ఏర్పాటు చేసిన గ్రామసభలను రైతులు వినియోగించుకోవాలని జెడ్పీటీసీ కాయల రమణ సూచించారు. మండలంలోని వెంకయ్యపేట గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మావిడి ధనలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ కె.గాయత్రి, సర్వేయర్ మెట్ట శ్రీరామమూర్తి, నాయకులు దేవిశెట్టి అమ్మారావు, ఎ.గొల్లాజీ, మావిడి శ్రీనివాసరావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేకు సిద్ధంగా ఉండాలి

గ్రామాల్లో భూ రీసర్వే చేపట్టడానికి గ్రామ సర్వేయర్లు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పని చేయాలని సూచించారు. గతంలో రీసర్వే పూర్తైన గ్రామాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులను గ్రామసభల ద్వారా పరిష్కారం చేసుకోవచ్చున్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాధిక, భూ రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న విద్యార్థిని

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఐఐఐటీ) ఎస్ఎంపురంలో పీయూసీ మొదటి ఏడాది చదువుతున్న విద్యార్థిని గౌసియా వసతి గృహంలో మంగళవారం జింక్ ఫాస్పేట్ ద్రావణం తాగి అపస్మారక స్థితికి చేరుకున్న విషయం తెలిసిందే. ఈ విద్యార్థిని శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ బుధవారం పూర్తిగా కోలుకుంది. నంద్యాల నుంచి తల్లిదండ్రులు సైతం చేరుకున్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధనబాలాజీ, పరిపాలన అధికారి మునిరామకృష్ణలు విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడారు. విద్యార్థిని కోలుకోవడంతో అధికారులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. మరికొన్ని గంటలు వైద్యుల పర్యవేక్షణలో ఉంచి డిశ్చార్జి చేయనున్నారు. తల్లిదండ్రులు విద్యార్థినిని కొన్నాళ్లు ఇంటికి తీసుకెళ్లేందుకు అనుమతి తీసుకున్నారు. ఎచ్చెర్ల పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

కిన్నెర కాంప్లెక్స్ ఎదురుగా అగ్ని ప్రమాదం

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని కిన్నెర కాంప్లెక్స్ ఎదురుగా బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించిందని జిల్లా అగ్నిమాపక సహాయ అధికారి వరప్రసాదరావు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కిన్నెర కాంప్లెక్స్ సమీపంలో ఖాళీ స్థలంలో అటువైపు వ్యాపారాలు చేసుకునేవారు చెత్తచెదారాలు వేయడంతో అనుకోకుండా అగ్నిప్రమాదం సంభవించి మంటలు భారీగా ఎగిసిపడ్డాయని, దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి మంటలు అదుపు చేశామని తెలిపారు.

పోస్టాఫీసులో ఖాతాలు పరిశీలన



పాస్‌బుక్‌ల పరిశీలనకు హాజరైన ఖాతాదారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం పోస్టాఫీసులో సేవింగ్స్ ఖాతాలను పోస్టల్ అధికారులు బుధవారం పరిశీలించారు. గత నెల 25న పోస్టుమాస్టర్ క్రాంతి కుమారి ఆత్మహత్యకు పాల్పడడంతో సేవింగ్స్ ఖాతాదారులు పక్క గ్రామాలకు వెళ్లి, తమ ఖాతాల్లో ఉన్న డిపాజిట్ డబ్బులు తెలుసుకున్నారు. అయితే ఆమె తమ డబ్బులను ఖాతాల్లో జమ చేయకుండా వ్యక్తిగతంగా వాడుకున్నారని ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. ఈ పోస్టాఫీసు పరిధిలో 900 ఖాతాలు ఉన్నాయి. పోస్టల్ అధికారి గౌరీ శంకర్ ఆధ్వర్యంలో ఖాతాలు పరిశీలించారు. ఖాతాల్లో జమ చేసిన డబ్బులకు పూర్తిస్థాయి భద్రత ఉంటుందని, ఎప్పుడైనా తమ డబ్బులు విత్‌డ్రా చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు. అనధికారంగా జరిగిన లావాదేవీలు, ఆధారాలు లేని లావాదేవీలపై తాము చేసేదేమీ లేదని స్పష్టం చేశారు. అయితే స్థానికుల నిరక్షరాస్యతను ఉపయోగించుకొని పోస్టుమాస్టర్ మోసం చేశారని వాపోతున్నారు. ఉన్నతాధికారులకు పూర్తిస్థాయి నివేదిక అందజేయనున్నట్లు సిబ్బంది తెలిపారు.